




జె. వేణిమాధవి
నేచురాలజిస్ట్

(గత సంచిక తరువాయి)

ఆంజనేయ మతి పాటలాననం
కాంచనాద్రి కమనీయ విగ్రహం
పారిజాత తరు మూల వాసినం
భావయామి పవమాన నందనం



## మీ వృక్షం ఏది?

### 11. పుబ్బ (పూర్వ ఫల్గుణి) నక్షత్రం - మోదుగ చెట్టు

| | | |
|---|---|---|
| సంస్కృత నామం | : | 'పలాస' |
| శాస్త్రీయ నామం | : | 'బ్యుటియ మొనోస్పెర్మ' |
| ప్రాంతీయ నామం | : | 'మోదుగ' |
| ఆంగ్ల నామం | : | 'ఫ్లేమ్ ఆఫ్ ది ఫారెస్ట్' |





**ఔషధ గుణాలు :**

1) పొట్ట ఉబ్బరం, దగ్గు, చర్మవ్యాధులు, కీళ్ళ నొప్పులు, మొలలు, మలబద్ధకము, మధుమేహము, వాపుల నివారణకు ఉపయోగ పడుతుంది.

2) ఇది పాముకాటుకు విరుగుడుగా పనిచేస్తుంది.

**విశేష గుణాలు :**

1) ఈ చెట్టు నవగ్రహాలలో ఒకటైన చంద్రునితో అనుసంధానం చెంది ఉంటుంది.

2) ఈ చెట్టు యొక్క ఆకులతో విస్తరాకులు చేస్తారు. ఈ ఆకులలో వేడి పదార్థములను ఉంచినప్పుడు కొన్ని రసాయనములను విడుదల చేస్తాయి.

3) ఇవి మనము తిన్న ఆహారము జీర్ణమగుటకు, ఇంకా పొట్ట ఉబ్బ రము రాకుండా ఉపకరిస్తాయి.

### 12. ఉత్తరా నక్షత్రం - జువ్వి చెట్టు

| | | |
|---|---|---|
| సంస్కృత నామం | : | 'ప్లక్ష' |
| శాస్త్రీయ నామం | : | 'ఫైకస్ ఇన్ఫెక్టోరియా' |
| ప్రాంతీయ నామం | : | జువ్విచెట్టు |



**ఔషధ గుణాలు :**

1) ఇది నోటి పుళ్ళు, గాయాల నివారణ కొరకు ఉపయోగపడుతుంది.

2) విరిగిన ఎముకలు అతికించుటకు వాడతారు.

3) ఇంకా ఇది యాంటిసెప్టిక్ మరియు యాంటి బాక్టీరియల్ గుణాలు కలిగి ఉన్నది.

**విశేష గుణాలు :**

1) ఇది మర్రి, రావి చెట్ల జాతికి చెందినది.

2) ఇది పంచ క్షీరదాలలో ఒకటి.

3) వ్రతాదులు ఆచరించునప్పుడు కలశాలలో ఉంచదగ్గ పంచవల్కము లలో ఇది ఒకటి.

4) గృహప్రవేశ సందర్భాలలో జువ్వి కర్రను పూజలో ఉంచడం కొన్ని ప్రాంతాలలోని ఆచారం.



అజ్ఞానంతో తొందరపడి ఏ పనీ చేయరాదు.

# దేవారామాలు

శ్రీరామనవమి సందర్భంగా రామాయణంలో మనకు ప్రముఖంగా కనిపించే కొన్ని దివ్య వృక్షాల గురించి తెలుసుకొందాం.

## అశోకవృక్షం

సాలానశోకాన్ భవ్యాంశ్చ చంపకాంశ్చ సుపుష్పితాన్।
ఉద్దాలకాన్ నాగవృక్షాన్ చూతాన్ కపిముఖానపి॥

(రామాయణం 5-14-3)



| | | |
|---|---|---|
| శాస్త్రీయ నామం | : | 'సరాకా ఇండికా' |
| ప్రాంతీయ నామం | : | 'సీతమ్మ అశోకము', 'వంజులము' |
| ఆంగ్ల నామం | : | 'అశోక' |

**ఔషధ గుణాలు :**

1) అధిక ఋతుస్రావమును నియంత్రిస్తుంది.
2) రక్త విరోచనములను అరికడుతుంది.
3) అల్సర్, మొటిమలు, మధుమేహము మొదలగువాటి నివారణకు ఉపయోగపడుతుంది.

**అపోహ :**

అశోకచెట్టు అనగానే మనకు సాధారణంగా కనిపించే సన్నగా, పొడవుగా పెరిగే చెట్టు అని అనుకుంటాము. కాని రామాయణంలో ప్రస్తావించిన అశోకము అసలైనది, ఇప్పుడు మనము పైన చెప్పుకొన్న చెట్టు.

### రామాయణంలోని సందర్భము - ప్రాముఖ్యత :

'అశోక' అనగా శోకము లేనిది. లంకయందు అశోకవనంలోని ఈ దివ్యవృక్షాలు, సీతా మహాసాధ్వి యొక్క దుఃఖమును ఉపశమింపజేసి, ఊరట కలిగించాయి.

## శింశుపా వృక్షం

తతస్సా వక్రకేశాంతా సుకేశీ కేశసంవృతమ్।
ఉన్నమ్య వదనం భీరుః శింశుపావృక్షమైక్షత॥

(5-31-17)



| | | |
|---|---|---|
| శాస్త్రీయ నామం | : | 'డాల్బెర్జియా సిస్సూ' |
| ప్రాంతీయ నామం | : | 'ఎర్ర సిస్సూ' |
| ఆంగ్ల నామం | : | 'ఇండియన్ రోజ్ వుడ్' |

**ఔషధ గుణాలు :**

1) కుష్ఠు, వాంతులు, విరోచనాలు, జ్వరము మొదలగువాటిని తగ్గిస్తుంది.
2) ఋతుస్రావపు ఎగుడు దిగుడులను సరిచేస్తుంది.
3) కళ్ళ వ్యాధులు, ఊపిరితిత్తుల వ్యాధులను తగ్గిస్తుంది.

ఈ చెట్లని మనం చాలా ప్రాంతాలలో, రోడ్డుకి ఇరువైపులా నీడ కోసం నాటి ఉండటం చూడవచ్చు.

### రామాయణంలో సందర్భము - ప్రాముఖ్యత :

హనుమంతుడు ఎట్టకేలకు సీతమ్మని అశోకవనములో కనుగొంటాడు. ఆమె ఎదురుగా లతలతో అల్లుకొని దట్టముగా ఉన్న ఈ శింశుపా వృక్షం మీద కూర్చుని ఉంటాడు. ఆ తరువాత రావణుడు రావటం, సీతమ్మతో సంభాషించటం, అటు పిమ్మట ఆంజనేయుడు రామాయణాన్ని చెప్పి సీతమ్మ ఎదుట పడటం జరిగింది. అంటే సుందర కాండలోని అతి సుందరమైన ఈ ఘట్టంకి సహకరించి ధన్యతనొందినవి ఈ అశోక, శింశుప వృక్షాలు.



ప్రతి మంచి ఆలోచన వెనుక వ్యతిరేకత ఆలోచన పరుగులు పెడుతూనే ఉంటుంది.

## సంజీవని మొక్క

మృతసంజీవనిం శ్చైవ విశాల్యకరణీమ్ అపి।
సువర్ణకరణీమ్ శ్చైవ సందానీమ్ చ మహౌషధీం॥

(రామాయణం 6-74-33)



శాస్త్రీయ నామం : 'సెలాజినెల్ల బ్రయోప్టరిస్'

ఆంగ్ల నామం : 'స్పైక్ మొస్'

### ఔషధ గుణాలు :

1) ఒత్తిడి వల్ల దెబ్బతిన్న కణాలను, పునరుత్తేజ పరుస్తుంది.

2) షాక్‌కు గురైన గుండెను తిరిగి నియంత్రిస్తుంది.

3) కామెర్లను, మూత్ర విసర్జనప్పుడు ఉండే వేడి, మంటను తగ్గిస్తుంది.

4) ఋతుక్రమ లోపాలని సరిచేస్తుంది.

5) సుఖ ప్రసవానికి వాడతారు (గిరిజనులు)

### రామాయణంలో సందర్భము - ప్రాముఖ్యత :

ఈ ఘట్టము మనందరికీ సుపరిచితమే. మేఘనాథుని వజ్రాయుధానికి మూర్ఛిల్లిన లక్ష్మణుని పునరుజ్జీవితుడిని చేసింది ఈ సంజీవని మొక్క. ఇది అతి ఎత్తయిన కొండలలో పెరిగే మొక్క. ఈ సంజీవని మొక్క ఇంకొక విశేష లక్షణం ఏమిటంటే, ఎండిపోయి, ముడుచుకొని ఉన్న దీని కొమ్మకి నీరు తగలగానే తిరిగి పచ్చగా నవనవలాడుతూ పెరుగుతుంది. ఈ దివ్య వృక్షాలని రామాలయాలు, హనుమాన్ మందిరాలలో, ఇళ్లలో ఇంకా అవకాశం ఉన్న ప్రదేశాలలో విరివిగా నాటి ప్రకృతి దేవతల ఆశీస్సులను పొందాలి. **(సశేషం)**

* ఔషధ గుణాలు సూచనమాత్రంగా ప్రస్తావించటం జరిగింది. వైద్యుని సంప్రదించి వాటిని ఉపయోగించ ప్రార్థన.



## మధువసంతం

కం॥ శ్రీకరమౌ సలలిత శో
భాకరమౌ విలసిత నవ వర శుభమృదు భా
వాకరమౌ వికసిత కుసు
మా కరమౌ మధువసంత మవనిన్ వెలసెను॥

సీ॥ కల్యాణ వాసంత కమనీయ గీతముల్
కాకలీ కంఠాలు కలిసి పాడ
కుసుమ శౌరభమెల్ల గుప్పున వెదజల్లి
పిల్లగాలులు వీచ నెల్ల దిశల
గండు తుమ్మెదరేడు దండుతో సభదీరి
విరుల కమ్మని తేనె విందులంద
వాసంత భామిని వరసుమకాంతితో
భవ్యహారతులెత్త నవ్యగతుల

తే॥ గీ॥ గున్నమామిడి ఫలముల గుమ్మరించ
విరుల సరులీయ భక్తితో విరులరేడు
నవ్యవత్సర విభుడును భవ్యగతుల
మహిని పాలించ వచ్చెను మనసులలర

ఆచార్య వి.ఎం. మోహన్
అల్లూరు, గుంటూరు జిల్లా



ఏ పని చేసినా, ఎవరి కోసం చేసినా సేవ అనే భావంతో చేయాలి.